సాక్షి సూర్యాపేట

సోమవారం : 4 : మార్చి : 2024



'గృహజ్యోతి'తో వెలుగులు

గృహజ్యోతి పథకంతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. - 8లో



ముగిసిన శతాబ్ది ఉత్సవాలు

నల్లగొండలో 1వ తేదీ నుంచి జరుగుతున్న ఆర్యసమాజ్ శతాబ్ది ఉత్సవాలు ఆదివారం ముగిసాయి. - 8లో



అగ్నిప్రమాదం

నాగార్జునసాగర్ ఫారెస్ట్ డివిజన్‌లోని నాగార్జునపేట తండా ప్రాంతంలో అగ్నిప్రమాదం జరిగింది. - 8లో

న్యూస్‌రీల్

రేపు నడిగూడెం పీఏసీఎస్ చైర్మన్ ఎన్నిక

నడిగూడెం: నడిగూడెం సహకార సంఘం చైర్మన్ ఎన్నిక మంగళవారం నిర్వహించనున్నారు. ఈమేరకు పాలకవర్గ సమావేశం నిర్వహించాలని సభ్యులకు డీసీఓ పద్మ ఆదివారం నోటీసులు జారీ చేశారు. సంఘంలో మొత్తం 13 మంది పాలకవర్గ సభ్యులుండగా శ్రీరంగాపురం గ్రామానికి చెందిన కొల్లు రామారావు 2021 నవంబర్ 11న చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. దీంతో పదవి ఖాళీగా ఉండడంతో గ్రామానికి చెందిన పుట్టా రమేష్ గత నెల 29 వరకు చైర్మన్‌గా వ్యవహరించారు. ఆయనపై సంబంధిత పాలకవర్గం అవిశ్వాస తీర్మానం పెట్టడంతో నెగ్గింది. వైస్ చైర్మన్‌గా ఉన్న సిరిపురానికి చెందిన గుండెపూరి రాములును తాత్కాలిక చైర్మన్‌గా డీసీఓ నియమించారు. ఈమేరకు ఈ నెల 5న నూతన చైర్మన్‌ను ఎన్నుకునేందుకు డీసీఓ నోటీసులు జారీ చేశారు. కాగా.. శ్రీరంగాపురానికి చెందిన కొల్లు రామారావును మళ్లీ చైర్మన్‌గా ఎన్నుకోనున్నట్లు సమాచారం.

చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలి



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ జయ

పెన్‌పహాడ్: పోలియో రహిత సమాజానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ జయ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ విధిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఆమె వెంట మండల వైద్యాధికారి స్రవంతి, పీహెచ్ఎన్ అనంతలక్ష్మి, సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనర్సింహస్వామి నిత్య కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనర్సింహస్వామి నిత్యకల్యాణాన్ని ఆదివారం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించారు. కల్యాణ తంతులో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో వైభవంగా నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై అలంకరించి ఆలయ తిరుమాఢ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణమంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

తొలిదశ ఉద్యమకారులను ఆదుకోవాలి

సూర్యాపేట: 1969లో తెలంగాణ తొలిదశ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను ఆదుకోవాలని 1969 తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చక్రహరి రామరాజు అన్నారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని వర్తక సంఘం భవనంలో జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి లక్ష్మీనారాయణ అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనకు జరిగిన ఉద్యమాలన్నింటిలో 1969లో జరిగిన తొలి ఉద్యమమే కీలకమన్నారు. ఆనాటి విద్యార్థులందరూ ఒక సంవత్సరం మొత్తం ఉద్యమంలో ఉండి ఒక విద్యా సంవత్సరాన్ని కోల్పోయి జీవితంలో ఎంతో నష్టపోయారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసి నిజమైన ఉద్యమకారులకు న్యాయం చేయాలని కోరారు. ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల స్థలంతో పాటు పెన్షన్ ఇవ్వాలని, ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. ఇదే విషయమై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో సీతారాంరెడ్డి, సంతోష్‌రెడ్డి, చంద్రారెడ్డి, సీహెచ్ విశ్వేశ్వర్‌రావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



గుర్రపుడెక్క పూలతో నిండిపోయిన తిప్పాయికుంట చెరువు

• చెరువంతా పూలవనం

మునగాల మండలంలోని ముకుందాపురం గ్రామశివారులో గల తిప్పాయికుంట చెరువు గుర్రపుడెక్క పూలతో నిండిపోయింది. సాగర్ ఆయకట్టు పరిధిలో ఉన్న ఈ చెరువులో గత వారం రోజులుగా నీటిమట్టం తగ్గడంతో గుర్రపు డెక్క విపరీతంగా పెరిగిపోయింది. ప్రస్తుతం గుర్రపుడెక్క పూలు పూసి పరిచినట్లుగా ఉండడంతో చెరువు బాటసారులను ఆకర్శిస్తోంది.

– మునగాల

జీరో బిల్లు ఆనందం

- ఈనెల 1వ తేదీ నుంచి అమలులోకి గృహజ్యోతి పథకం
- జిల్లాలో ఇప్పటివరకు 51,240 మందికి జీరో బిల్లుల అందజేత
- 1,47,371 మందిని అర్హులుగా గుర్తించిన అధికారులు



నాగారంలో వినియోగదారులకు జీరో బిల్లులు అందజేస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

నాగారం: ప్రతి నెలా విద్యుత్ బిల్లు చూడగానే మధ్య తరగతి ప్రజల గుండె గుభేలుమనేది. గృహజ్యోతి పథకం ద్వారా అలాంటి బాధకు రాష్ట్ర ప్రభుత్వం చెక్ పెట్టింది. గృహజ్యోతి కింద 200 విద్యుత్ యూనిట్ల వరకు జీరో బిల్లు ప్రకటించడంతో దానిని ఈనెల 1వ తేదీ నుంచి అమలు చేసింది. ఈమేరకు జిల్లాలో ట్రాన్స్‌కో అధికారులు ఇంటింటికీ వెళ్లి మీటర్ రీడింగ్ తీస్తూ 'జీరో' విద్యుత్ బిల్లును వినియోగదారులకు అందిస్తున్నారు. ఆ బిల్లులు చూసిన ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రూ.800 వరకు వచ్చిన విద్యుత్ బిల్లు ఇప్పుడు జీరో వస్తోంది. కాగా.. జనవరి నెలలో బిల్లు చెల్లించని వారికి పాత బకాయి మాత్రమే వస్తోంది. ఫిబ్రవరి నెలది మాత్రం జీరో చూపిస్తోంది. అయితే.. కొందరికి మాత్రం జీరో బిల్లు అమలు కావడం లేదు. దీనికి కారణం ప్రజా పాలనలో దరఖాస్తులను తప్పుగా నమోదు చేయడంతో వారికి బిల్లు వస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. అలాంటి వారు ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తు రశీదు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, విద్యుత్ బిల్లును తీసుకొని ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు.

తొలిరోజు 6,020 మందికి జారీ..

రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకం అమలు చేయడంతో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలులోకి వచ్చింది. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు జిల్లాలో అర్హులైన వినియోగదారులకు జీరో బిల్లులు జారీ చేసే ప్రక్రియ ప్రారంభించారు. జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే విద్యుత్ కనెక్షన్లు 3,21,459 ఉండగా వీటిలో 2,77,136 విద్యుత్ కనెక్షన్లు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. గృహజ్యోతి పథకానికి 1,47,371 మందిని అర్హులుగా గుర్తించారు. దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా తొలిరోజు (మార్చి–1న) 6,020 మంది వినియోగదారులకు, రెండో రోజు 17,342 మందికి, మూడో రోజు 27,878 మందికి, మొత్తంగా ఇప్పటివరకు 51,240 మందికి జీరో బిల్లులు అందజేశారు.

అర్హులుంటే వివరాలు నమోదు చేయించుకోవాలి



గృహజ్యోతి పథకానికి అర్హులు ఉంటే వారు తమ తెల్ల రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ప్రజాపాలన దరఖాస్తు నంబర్‌తో ఎంపీడీఓ, మున్సిపాలిటీ కార్యాలయాలకు వెళ్లి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయించుకోవాలి. వాటిని విద్యుత్‌శాఖ అధికారులకు అందజేస్తే ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్‌ను పొందవచ్చు. అర్హులు గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీనివాస్, విద్యుత్‌శాఖ డీఈఈ, సూర్యాపేట

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

- మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

సూర్యాపేట రూరల్: పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని 47వ వార్డులో పోలియో చుక్కల కార్యక్రమాన్ని గిరినగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. పోలియో చుక్కలు వేయించడంలో తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. పల్స్ పోలియోను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొప్పుల వేణారెడ్డి, కుమ్మరికుంట్ల వేణుగోపాల్, జిల్లా నాయకులు చెంచల శ్రీనివాస్, నాగుల వాసు, నేరేళ్ల వేణు, పోలగాని ఉపేందర్, కొండా రాజేష్, శివ, పర్వతం ఉపేంద్రచారి, ఏఎన్ఎం విజయ, ఆశ కార్యకర్త పారిజాత తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లిలో గజవాహన సేవ

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం అర్ధరాత్రి గజవాహన సేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏనుగుపై నర్సింహస్వామి, అమ్మవార్లు శ్రీదేవి, భూదేవిలు కొలువుదీరారు. స్వామి, అమ్మవార్లను గజవాహనంపై ఆలయంలోని మాడ వీధులలో ప్రదక్షిణలు జరిపించి.. అనంతరం ఏనుగుపై పురవీధుల్లో ఊరేగించారు. ఉత్సవానికి హాజరైన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, ధర్మకర్తలు జేరుపోతుల సోమయ్య, దిర్శనపు కృష్ణమూర్తి, కనుకు రేణుక, లక్ష్మాజీ, ఈఓ వై.శ్రీనివాసరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ పన్నాల శ్రీనివాసరెడ్డి, అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



గజవాహన సేవ నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

పంటల బీమాకు గ్రీన్‌సిగ్నల్

- ప్రధాన మంత్రి ఫసల్ బీమా అమలుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- వచ్చే వానాకాలం సీజన్ నుంచి ప్రారంభం
- జిల్లాలో 2.90లక్షల మంది రైతులకు లబ్ధి



దురాజ్‌పల్లి (సూర్యాపేట): రైతులు సాగు చేసిన పంట చేతికొచ్చేదాకా ఆందోళనగానే ఉంటుంది. ఓ పక్క అనావృష్టి, మరోపక్క అతివృష్టి అన్నదాతలకు కడగళ్లు మిగులుస్తాయి. రూ. వేలల్లో పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితులు దాపురిస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం వచ్చే పంటకాలం నుంచి పీఎం ఫసల్ బీమా యోజనలో చేరేందుకు నిర్ణయించింది.

వ్యవసాయ ఆధారిత జిల్లా..

సూర్యాపేట వ్యవసాయ ఆధారిత జిల్లా కావడంతో ముఖ్యంగా వరి, పత్తి, మొక్కజొన్న, జొన్న, కందితో పాటు కూరగాయ పంటలు సాగు చేస్తుంటారు. ప్రకృతి విపత్తులతో నష్టం వాటిల్లితే పెట్టిన పెట్టుబడులు రాబట్టుకునేందుకు అన్నదాతలు బీమా చేసుకుంటారు. గతంలో 2016 నుంచి 2020 వరకు రాష్ట్రం ఫసల్ బీమా పథకంలో భాగంగా ఉండేది. అప్పుడు చాలా మంది రైతులు ప్రీమియం చెల్లించారు. ఆ తరువాత అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకం నుంచి వైదొలిగింది. ఇప్పుడు మళ్లీ ప్రధాన మంత్రి ఫసల్ బీమాలో చేరాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో జిల్లాలో వేలాది మంది రైతులకు ప్రయోజనం కలగనుంది.

యాసంగిలో 3,84,567 ఎకరాల్లో సాగు..

జిల్లాలో 2.90లక్షల మంది రైతులున్నారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో 3,84,567 ఎకరాల్లో పంటలు వేశారు. గతేడాది ఇదే సీజన్లో 4.50లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. గత ఏప్రిల్, మే నెలల్లో వరి పంట చేతికి వస్తున్న సమయంలో వడగళ్ల వాన కురవడంతో వేలాది ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లింది. 33,264 మంది రైతులు నష్టపోగా.. 32,718 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా వరి ధాన్యం నేల రాలి రూ.లక్షల్లో నష్టపోయారు. ప్రస్తుతం ఫసల్ బీమాలో చేరడంతో రైతులకు మేలు కలగనుంది. వానలు, వడగళ్లతో పంటలు నష్టపోతే బీమా చేసుకున్న వారికి ఉపయోగకరంగా ఉండనుంది.

ఎంతో మేలు

ఫసల్ బీమా పథకం రైతులకు ఎంతో మేలు కలిగిస్తుంది. పండించిన పంటలు చేతికి వచ్చే దాకా అనుమానంగా ఉంటుంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు కళ్ల ముందే దెబ్బతింటుంటే ఏమీ చేయ లేని దుస్థితి ఉండేది. అదే బీమా చేసుకుంటే రైతులకు ఎంతో ధీమాగా ఉంటుంది.

– కొల్లు అప్పయ్య, మాచపల్లి, నూతనకల్ మండలం

కందికి మద్దతుకు మించి ధర



తిరుమలగిరి మార్కెట్‌లో కందుల రాశులు

- తిరుమలగిరి మార్కెట్‌కు 9,603 క్వింటాళ్ల కందులు రాక
- క్వింటాకు అత్యధికంగా రూ.10,217పైగానే పలికిన ధర

తిరుమలగిరి (తుంగతుర్తి): ఈ సంవత్సరం కందులు వేసిన రైతుల ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ప్రభుత్వ మద్దతు ధర కంటే వ్యవసాయ మార్కెట్‌లో అత్యధిక ధర వస్తుండటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో ఈ సంవత్సరం అత్యధికంగా క్వింటాకు రూ.10,217 ధర పలికిందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.7 వేలు ఉండగా అంతకు మించి ధర వస్తోంది. గత రెండు నెలలుగా తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ యార్డుకు 9,603 క్వింటాళ్ల కందులు వచ్చాయి. మార్కెట్‌లో కనిష్ఠంగా రూ.8వేల నుంచి గరిష్ఠంగా రూ.10217లకు పైగానే ధర పలుకుతోంది.

కలిసొచ్చిన కాలం

ఈ సంవత్సరం కంది రైతులకు కాలం కలిసొచ్చింది. జిల్లాలో ఈ సంవత్సరం 696 ఎకరాల్లో కంది పంట వేశారు. ఎకరాకు సుమారు 5 నుంచి 6 క్వింటాళ్ల చొప్పున దిగుబడి వస్తుందని అంచానా వేశారు. గతంలో కంది పంటను అంతర పంటగా సాగు చేయగా.. ఈసారి 30 శాతం మంది రైతులు పూర్తిగా కంది వేసినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

తిరుమలగిరి: మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తు గడువును 11వతేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ వేముల బాలరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో వంద సీట్లకు 7 నుంచి పదవ తరగతి వరకు మిగిలిపోయిన సీట్లకు ప్రవేశాల కోసం అర్హత కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పరీక్ష ఫీజుగా జనరల్ విద్యార్థులు రూ.200, బీసీ, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.125 చెల్లించాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 1న హాల్ టిక్కెట్ల డౌన్‌లోడ్, ఏప్రిల్ 7న పరీక్ష ఉంటుందని తెలిపారు.

అన్నదాత 'వరి'గోస



వరిపొలానికి ట్యాంకర్‌తో నీరు సరఫరా చేస్తున్న రైతు పురుషోత్తంరెడ్డి

- ఎండుతున్న పొలానికి ట్యాంకర్‌తో నీటి సరఫరా

మునగాల(కోదాడ): మండలంలోని ఆయకట్టు పరిధిలో సాగుచేసిన వరిపొలాలకు నీరందక ఎండిపోతున్నాయి. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పొలాలను కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. ప్రస్తుతం బోర్లు, బావుల్లో నీరు తగ్గిపోవడంతో వరికి పూర్తిస్థాయిలో నీరు అందడం లేదు. నోటికాడికి వచ్చిన పంటను కాపాడుకునేందుకు కొందరు రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. మునగాల మండలంలోని నారాయణగూడెం గ్రామానికి చెందిన రైతు కందుల పురుషోత్తంరెడ్డి మూడు ఎకరాల వరిపొలం సాగు చేశాడు. వారం రోజులుగా పొలంలో ఉన్న రెండు బోర్లలో నీటిమట్టం తగ్గి మూడు ఎకరాలలో కేవలం ఎకరా పైరుకే నీరందుతుంది. దీంతో సదరు రైతు ట్యాంకర్ ద్వారా రోజుకు రూ.వేయి చొప్పున ఆరు, ఏడు ట్యాంకుల నీటిని రెండు ఎకరాల్లోని వరి పైరుకు అందించి పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నాడు. సాగర్ ఎడమకాలువకు రెండురోజుల్లో నీటిని విడుదల చేస్తే తమ పంటను కాపాడుకునే అవకాశం ఉందని రైతు పేర్కొంటున్నాడు.

బక్కచిక్కుతున్న బాల్యం

- పోషకాహార లోపం బారిన పడుతున్న చిన్నారులు
- లోపిస్తున్న ఎదుగుదల
- పల్లె ప్రాంతాల్లో తల్లిదండ్రులకు పౌష్టికాహారంపై అవగాహన కరువు
- ప్రభుత్వం చర్యలు చేపడుతున్నా పూర్తిస్థాయిలో చేరుకోని లక్ష్యం



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల బరువు కొలుస్తున్న అంగన్‌వాడీ టీచర్

హుజూర్‌నగర్: పోషకాహార లోపంతో బాల్యం బలహీనమైపోతోంది. సరైన అవగాహన లేక, పోషక పదార్థాలు సరిగా అందక చిన్నారుల్లో ఎదుగుదల లోపిస్తోంది. పిల్లలలో కొంతవరకు ఆరోగ్యం కూడా క్షీణిస్తోంది. ఇలాంటి చిన్నారుల ఆరోగ్య సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. వీరిని గుర్తించి బంగారు భవిత కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. అయినా పల్లె ప్రాంతాల్లో తల్లిదండ్రులకు పోషకాహారంపై అవగాహన లేకపోవడంతో ప్రభుత్వం అనుకున్న లక్ష్యాన్ని పూర్తి స్థాయిలో చేరుకోలేకపోతోంది.

జిల్లాలో 1,209 అంగన్‌వాడీ కేంద్రాలు..

జిల్లాలో ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటి పరిధిలో 1,209 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. గర్భిణులు 6,080 మంది, బాలింతలు 4,380 మంది ఉన్నారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 0 నుంచి 6 నెలల లోపు చిన్నారులు 4,561 మంది, 7 నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలు 28,250 మంది ఉన్నారు. 3 నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలు 18,612 మంది ఉన్నారు. వారిలో అధికారుల లెక్కల ప్రకారం వయసుకు తగిన ఎత్తు, బరువు లేకపోవడం, ఎత్తుకు తగ్గ బరువు లేని పిల్లలను గుర్తించారు. వారిలో తక్కువ బరువు ఉన్న పిల్లలు 1,471 మంది, అతి తక్కువ బరువు ఉన్న పిల్లలు 195 మంది ఉన్నట్లు గుర్తించారు. వయసు తగ్గ ఎత్తు లేకపోవడం, మాధ్యమిక కురుచదనం ఉన్న పిల్లలు 3,427 మంది, తీవ్ర కురుచదనం ఉన్న పిల్లలు 923 మంది ఉన్నారు. ఎత్తుకు తగ్గ బరువు లేకపోవడం (పోషణ లోపం) గల వారిలో తీవ్ర పోషణ లోపం ఉన్న పిల్లలు 706 మంది, అతి తీవ్ర పోషణ లోపం పిల్లలు 121 మంది ఉన్నట్లు గుర్తించారు.

పల్లెల్లో చిన్నారులకు అందని పోషకాహారం

అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య, గుడ్లు, పాలు, బాలామృతం, మధ్యాహ్న భోజనంతోపాటు చిరుతిండ్లు అందిస్తున్నారు. చిన్నారులు ఆరోగ్యంగా ఎదిగేందుకు కేంద్ర ప్రభుత్వం పోషణ్ అభియాన్ ద్వారా కృషి చేస్తోంది. ఈ క్రమంలోనే ఎత్తుకు తగ్గ బరువు లేని పిల్లలను గుర్తించి ఐసీడీఎస్ అధికారులు సూచనల మేరకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అక్కడ కూడా సరికాకపోతే అవసరాన్ని బట్టి వారిని న్యూట్రీషియన్ రిహాబిలిటేషన్ సెంటర్ (ఎన్ఆర్‌సీ)కు పంపి వారికి వైద్య చికిత్సలు, పోషకాహారం అందిస్తున్నారు. అయితే పల్లె ప్రాంతాల్లో పిల్లలకు సరైన పోషకాహారం అందక ఎత్తుకు తగిన బరువు ఉండటం లేదు. గ్రామీణ కుటుంబాల్లో ముఖ్యంగా పేదరికం, అవగాహన లేమితో చిన్నారులకు పౌష్టికాహారం అందడం లేదు. వ్యవసాయ పనులు, కూలీకి వెళ్లే వారు తమ పిల్లలను ఇంటి వద్దే వదిలేసి వెళ్తుండటంతో చిన్నారులు ఆకలితో అల్లాడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలకు పోషకాహారంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కేంద్రాలపైనే ఉంది.

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం



పోషకాహార లోపం కలిగిన పిల్లలను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలామృతం స్థానంలో మరిన్ని ఎక్కువ పోషకాలు కలిగిన ఆహారం (బాలామృతం ప్లస్)ను అందిస్తున్నాం. అంతేకాకుండా ఆయా పిల్లల తల్లిదండ్రులకూ అవగాహన కల్పించి, వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నాం. చాలా చోట్ల అవసరమైన చిన్నారులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఎన్ఆర్‌సీల ద్వారా వైద్యచికిత్సలు, పోషకాలు అందించేలా కృషి చేస్తున్నాం.

– వెంకటరమణ, జిల్లా సంక్షేమ అధికారి, సూర్యాపేట

క్లుప్తంగా

అటవీ ప్రాంతంలో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న అటవీశాఖ సిబ్బంది

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ఫారెస్ట్ డివిజన్‌లోని నాగార్జునపేట తండా ప్రాంతంలో ఆదివారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. మంటలు లేచి అడవిని చుట్టుముట్టడంతో అటవీశాఖ సిబ్బంది ఆప్రాంతానికి వెళ్లి ఫైర్ బ్లోయర్ల సహాయంతో ఆర్పారు. కిలోమీటరు మేరమంటలు అంటుకోవడంతో అష్టకష్టాలు పడి మంటలను అదుపులోకి తెచ్చారు. నాగార్జునపేట ప్రాంతంలో రైతులు పత్తికట్టెతో పాటు చెలకలలో ఉన్న చెత్తచెదారాలను తగుల బెట్టి వాటిని ఆర్పకుండానే రావడంతో గాలికి సమీపంలోగల అటవీ ప్రాంతం అంటుకుంది. మంటలు చెలరేగడంతో రైతులు ఇచ్చిన సమాచారం మేరకు హుటాహుటిన వెళ్లి మంటలను ఆర్పారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

చౌటుప్పల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన చౌటుప్పల్ మండల పరిధిలోని చిన్నకొండూర్–మసీదుగూడెం రోడ్డులో ఆదివారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మసీదుగూడెం గ్రామానికి చెందిన సయ్యద్ గోరేమియా(47) కులవృత్తి అయిన బండరాళ్లు కొట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అందులో భాగంగా శనివారం ఉదయం పని కోసం మండలంలోని ఎస్.లింగోటం గ్రామానికి వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబసభ్యులు 9గంటల ప్రాంతంలో ఫోన్ చేయగా వస్తున్నానని చెప్పాడు. కానీ ఇంటికి మాత్రం వెళ్లలేదు. ఆదివారం ఉదయం కుటుంబసభ్యులు మరో సారి ఫోన్ చేయగా సమీపంలో ఉన్న ఓ వ్యక్తి ఫోన్ లిఫ్ట్ చేశాడు. ఇక్కడ ఈయన పొలంలో పడి చనిపోయాడని చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కాగా పొలంలో ఎలా పడ్డాడన్న విషయంలో స్పష్టతలేదు. అయితే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో పడిపోయాయని మృతుడి తండ్రి గాలీబ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

అపరిశుభ్రమైన ఐస్‌క్రీమ్‌లు పట్టివేత

భువనగిరి క్రైమ్: నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఐస్‌క్రీమ్ తయారు చేస్తున్న ఫ్యాక్టరీపై పోలీసులు దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. భువనగిరి పట్టణంలోని బీచ్ మహల్లా కాలనీలో ఆశిష్ కుశ్వ హెల్తీ డైరీటెక్ ఐస్‌క్రీమ్ పేరుతో వ్యాపారం చేస్తున్నాడు. ఆదివారం ఎస్‌ఓటీ పోలీసులు సమాచారం మేరకు ఐస్‌క్రీమ్ యూనిట్‌పై దాడి చేశారు. నల్లగొండకు చెందిన నరేందర్ ఇద్దరు కలిసి వ్యాపారం చేస్తుండగా నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తున్నట్లు తేలింది.ఈ దాడుల్లో ఎల్‌టి డైరీ, టెక్ కోన్ ఐస్ క్రీమ్‌లు పెద్ద సైజు 80, మినీ సైజ్ 180, చాకోబార్ 240, వెనిలా 200, ఆరోగ్యకరమైన డివల్ డైరీ టెక్‌గ్రేప్ అండ్ మ్యాంగో బార్ ఐస్‌క్రీమ్‌లు, డ్రై ఐస్‌క్రీములు 5 కిలోలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఓటీ పోలీసులు తెలిపారు.

‘గృహజ్యోతి’తో వెలుగులు

- పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గృహజ్యోతి పథకంతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతాయని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం తిప్పర్తి మండలంలో గృహజ్యోతి లబ్ధిదారులకు జీరో బిల్లులను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు నెలల్లో రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడంలో ప్రభుత్వం చొరవ చూపుతుందని అన్నారు. ప్రభుత్వం చెప్పిన విధంగా ఐదవ పథకం గృహజ్యోతి ప్రారంభించుకోవడం సంతోషకరమన్నారు. దురదృష్టవశాత్తు ఈసారి వర్షాలు లేకపోవడం వల్ల శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయంలో నీరు అడుగంటిపోయాయన్నారు. ఎవరికి ఇబ్బంది కలగకుండా వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మి, ఆర్డీఓ రవి, విద్యుత్ శాఖ ఎస్ఈ చంద్రమోహన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జూకూరి రమేష్, బద్దం సుధీర్, ముత్తినేని శ్యామ్‌సుందర్, జాకటి మోష తదితరులు పాల్గొన్నారు.



కనగల్ మండలం దర్వేశిపురం వద్ద రోడ్డు పనులు పరిశీలిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి

అభివృద్ధి పనులకు శ్రీకారం

తిప్పర్తి మండలంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ఆదివారం తిప్పర్తి మండలంలో పర్యటించిన ఆయన పల్స్ పోలియో కేంద్రాన్ని పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ వర్కర్లకు నూతన భవనం నిర్మించేందుకు అంచనా వేసి పనులకు వెంటనే చర్యలు తీసుకోవాలని పీఆర్ డీఈ నాగయ్యను ఆదేశించారు.

అన్ని వర్గాలకు అండగా కాంగ్రెస్

కనగల్ : కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటుందని మంత్రి కోమటిరెడి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం కనగల్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గృహజ్యోతి జీరో బిల్లును ఆయన ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలో రాజకీయాలకతీతంగా ప్రతిఒక్కరికి అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. మండలంలోని పగిడిమర్రి, దోరెపల్లి వంతెనతో పాటు ఆయా గ్రామాల్లో రెండు వరుసల రహదారులను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. కనగల్ మండల కేంద్రాన్ని సుందరీకరించనున్నట్లు తెలిపారు. ఎస్ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పూర్తిచేయడంతో పాటు కాలువల లైనింగ్‌కు సీసీకి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ పద్మ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనూప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీలు నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, మందడి రాంచంద్రరెడ్డి కాంగ్రెస్ నాయకులు గుండెబోయిన భిక్షంయాదవ్, దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి, భారత వెంకటేశం, కోయగూర అంజిరెడ్డి, కూసుకుంట్ల రాజిరెడ్డి, గోలి జాగల్‌రెడ్డి, గోలి నర్సిరెడ్డి, బొగరి రాంబాబు, దేప నరేందర్‌రెడ్డి, హఫీజ్, బిక్షపాటి మోహన్‌రెడ్డి, రాయల శ్రవణ్ తదితరులున్నారు.



తిప్పర్తిలో లబ్ధిదారులకు జీరో విద్యుత్ బిల్లు అందజేస్తున్న మంత్రి, ఎస్ఈ, డీఈలు

రోడ్డుపైనే ధాన్యం ట్రాక్టర్ల నిలిపివేత

త్రిపురారం : మండలంలోని కంపాసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలో బాబుసాయి పేట రోడ్డులో ఉన్న రంగా ఫుడ్ ప్రొడక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ రైస్ మిల్లుకు వచ్చిన ధాన్యం ట్రాక్టర్లు నిర్లక్ష్యంగా రోడ్డుపైనే నిలపి ఉంచుతుండడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. డబుల్ రోడ్డు అయినప్పటికీ నడి రోడ్డుపైనే భారీ బోరాల్లో ధాన్యం నింపుకున్న ట్రాక్టర్లు నడి రోడ్డుపైనే నిలుపుతుండడంతో చిన్న వాహనాలు సైతం పోవడానికి ఇబ్బందులు తప్పడం లేదు. ఈ రోడ్డులో భారీ పరిశ్రమలైన డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, విశాఖ ఇండస్ట్రీస్, వ్యవసాయ పరిశోధన స్థానం, కృషి విజ్ఞాన కేంద్రం, టీఎస్ మోడల్ స్కూల్, కస్తూరీ భా గాంధీ పాఠశాలు ఉండడంతో ఈ రోడ్డు వెంట వాహనాలు నిత్యం రద్దీగా ఉంటుంది. పాఠశాలలు,కళాశాలు కూడా ఉండడంతో విద్యార్థులకు ఎక్కడా ప్రమాదాలు జరుగుతాయనో విద్యార్థుల తల్లిదండ్రులు సైతం భయపడుతున్నారు. మండల కేంద్రం నుంచి ఈ రోడ్డు వెంట హైదరాబాద్ వెళ్లడానికి భారీ వాహనాలు కూడా రాకపోకలు సాగిస్తుంటాయి. రైస్ మిల్లు యాజమాన్యం మిల్లుకు వచ్చిన వాహనాలను నిర్లక్ష్యంగా రోడ్డుపై నిలపకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



బాబుసాయి పేట రోడ్డులో నిలిపిన ధాన్యం ట్రాక్టర్లు

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కట్టంగూర్ : కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామశివారులో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. అయిటిపాముల గ్రామానికి చెదిన సున్నపు రాజశేఖర్(23) ద్విచక్ర వాహనంపై నకిరేకల్ నుంచి స్వగ్రామం బయలుదేరాడు. మార్గమధ్యలోని అయిటిపాముల గ్రామ శివారులోని చెర్వుఅన్నారం బస్‌స్టాప్ వద్దకు రాగానే సూర్యాపేట నుంచి హైదరాబాదు వైపు వెళుతున్న సిమెంట్ ట్యాంకర్ డ్రైవర్ అతివేగంగా నడుపుతూ ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాజశేఖర్ ట్యాంకర్ టైర్ల మధ్య ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. అదుపు తప్పిన ట్యాంకర్ కల్వర్టు బ్రిడ్జి గోడను ఢీకొట్టి పల్టీకొట్టింది. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని తొలగించి పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ ఎన్ శ్రీను తెలిపారు.



హైవేపై బోల్తాకొట్టిన సిమెంట్ ట్యాంకర్

ముగిసిన ఆర్యసమాజ్ శతాబ్ది ఉత్సవాలు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలో ఆర్య సమాజ్ శతాబ్ది ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ నెల 1వ తేదీన ప్రారంభమైన ఆర్య సమాజ్ శతాబ్ది, సరస్వతీ దయానంద మహర్షి ద్విశత జయంతి ఉత్సవాలు మూడు రోజులపాటు కొనసాగాయి. ముగింపు కార్యక్రమానికి రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నల్లగొండ పట్టణంలో మూడు రోజుల పాటు మహాయజ్ఞం నిర్వహించడం శుభసూచకమన్నారు. ప్రభుత్వ నిధుల ద్వారా ఆర్య సమాజంలో గోశాలను ఏర్పాటు చేస్తామన్నారు. అన్ని సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ సందర్భంగా గోమాత పూజ, హోమం నిర్వహించారు. అనంతరం ఆర్య సమాజ్ కమిటీ సభ్యులు మంత్రిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్య ప్రతినిధి సభ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ విఠల్‌రావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బోయినపల్లి కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ కేసాని వేణుగోపాల్‌రెడ్డి, ఆర్య సమాజ సభ్యులు కంది సూర్యనారాయణ, రవీందర్‌రావు, శంకర్, లక్ష్మినర్సు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆర్యసమాజ్ సభ్యులు

అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

హుజూర్‌నగర్: అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గరిడేపల్లి మండల ఎల్‌బీనగర్ శివారు జాన పహాడ్ మేజర్ కాలువలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సుమారు 40 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతదేహం 2022 సంవత్సరం అక్టోబర్ 10వ తేదీన మేజర్ కాలువలో కొట్టుకు వచ్చినట్లు సీఐ చరమందరాజు ఆదివారం తెలిపారు. మృతుడి దేహంపై తెలుపు రంగు లుంగీ, నీలి, తెలుపు రంగు గడులు గల ఫుల్ షర్ట్ ఉన్నదని, భుజంపై ఆంజనేయస్వామి పచ్చబొట్టు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ వ్యక్తిని ఎవరో వ్యక్తులు చంపి, చేతులు కట్టి, ప్లాస్టిక్ బ్యాగ్‌లో పెట్టి కాలువలో పడవేసినారని పంచాయతీ సెక్రెటరీ ఫిర్యాదు మేరకు గరిడేపల్లి పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు స్థానిక సీఐ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.



గుర్తుతెలియని మృతదేహం

ఉరేసుకొని బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ ఆత్మహత్య

కట్టంగూర్: మండల పరిధిలోని అయిటిపాముల గ్రామ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్(బీపీఎం) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం పట్టణానికి చెందిన దేవరపల్లి యమున(30) ఆరు నెలల క్రితం అయిటిపాముల బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్‌గా విధుల్లో చేరింది. అయిటిపాములలోనే అద్దె ఇంట్లో ఉంటున్న యమున ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తలుపులు తీయకుండా ఉండటంతో చుట్టుపక్కల వారు గమనించి నల్లగొండలో ఉంటున్న ఆమె బంధువులకు సమాచారం ఇచ్చారు. నల్లగొండ నుంచి వచ్చిన బంధువులు తలుపులు తీసి చూసేసరికి యమున చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించింది. యమున మృతిపై అనుమానం ఉందని ఆమె అన్న దేవరపల్లి దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్. శ్రీను తెలిపారు.



యమున మృతదేహం

పీడీఎస్ బియ్యం పట్టివేత

కట్టంగూర్: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని కట్టంగూర్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఎస్ఐ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం .. కట్టంగూర్ మండల కేంద్రంలోని నల్లగొండ క్రాస్ రోడ్డు వద్ద హైవేపై వాహనాలు తనిఖీ చేస్తుండగా అశోక్ లేలాండ్ వాహనం సూర్యాపేట నుంచి హైదరాబాదు వైపు వెళుతుండగా పట్టుబడినట్లు తెలిపారు. వాహనంలో రెండు టన్నుల నాలుగు క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకొని డ్రైవర్ ధరావత్ వెంకటేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కరాటేలో రాణిస్తున్న యశ్విత

మునగాల(కోదాడ): మండలంలోని ఆకుపాముల గ్రామానికి చెందిన బాలెంల వెంకన్న, కళావతి దంపతుల కుమార్తె యశ్విత కరాటేలో రాణిస్తోంది. ప్రస్తుతం కోదాడ పట్టణంలోని జిల్లా పరిషత్(బాలికల) ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న యశ్విత గత ఏడాది కాలంగా స్థానికంగా ఉన్న బాలుర ఉన్నత పాఠశాలలో కరాటే మాస్టర్ సహదేవ్ వద్ద శిక్షణ పొందుతోంది. ఈ క్రమంలో ఖమ్మం, వరంగల్ పట్టణాల్లో జిల్లాస్థాయిలో నిర్వహించిన కరాటే పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చింది. ఆదివారం ఖమ్మం పట్టణంలో సుమన్ షాటోకాన్ స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్ట్ కాంపిటీషన్ పోటీల్లో యశ్విత పాల్గొని ప్రముఖ సినీనటుడు సుమన్ చేతుల మీదుగా బ్లాక్ బెల్ట్, ప్రశంసాపత్రం అందుకుంది. యశ్విత చదువుతో పాటు కరాటేలోనూ రాణిస్తుండడంతో ఆమె తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



సినీ నటుడు సుమన్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న యశ్విత

కారు బోల్తా... నలుగురికి గాయాలు

భూదాన్‌పోచంపల్లి: వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి బోల్తా పడగా.. అందులో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం సాయంత్రం పోచంపల్లి పట్టణ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూలూరు నుంచి పోచంపల్లి వైపు వస్తున్న కారు పోచంపల్లి పట్టణంలోని మార్కండేయనగర్ కాలనీ దాటిన తర్వాత జీబీఆర్ గార్డెన్స్ సమీపంలో మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న డీసీఎంను తప్పించబోయి అదుపుతప్పి రోడ్డు పక్కన కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులోని ఎయిర్‌బ్యాగులు తెరుచుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే కొత్తపేటకు చెందిన పేరళ్ల రవికుమార్, పిట్టం శకుంతలతో పాటు రవికుమార్ పిల్లలు పేరళ్ల శ్రీలక్ష్మి, పేరళ్ల సాయితేజ కాళ్లు, తలకు గాయాలయ్యాయి. వెంటనే అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.



బోల్తాపడిన కారు

బైక్ అదుపుతప్పి ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి

పెన్‌పహాడ్: మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందాడు. వివరాలు.. సూర్యాపేట పట్టణంలో నివాసముంటున్న మైలారపు వెంకన్న(56) పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం సొంత పనుల నిమిత్తం బైక్‌పై పెన్‌పహాడ్ మండల కేంద్రానికి వచ్చి సూర్యాపేట వెళ్తుండగా పెన్‌పహాడ్ మండలంలోని సింగారెడ్డిపాలెం గ్రామంలో బైక్ అదుపుతప్పి కిందపడిపోవడంతో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య వనజ, ఇద్దరు కుమారులు ఉన్నారు. వెంకన్న కుటుంబానికి ఎంఈఓ నకిరేకంటి రవి, ఉపాధ్యాయ బృందం ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.



వెంకన్న (ఫైల్)

సైన్స్ ఫేర్‌లతో మేధోశక్తి పెరుగుతుంది



విద్యార్థుల ఎగ్జిబిట్లను తిలకిస్తున్న ట్రైనీ ఐపీఎస్ రాజేష్ మీనా



సైన్స్ ఫేర్‌లో ఎగ్జిబిట్లను ప్రదర్శిస్తున్న జయ స్కూల్ విద్యార్థులు

- ట్రైనీ ఐపీఎస్ రాజేష్ మీనా

సూర్యాపేటటౌన్: సైన్స్ ఫేర్‌లతో విద్యార్థుల్లో మేధోశక్తి పెరుగుతుందని ట్రైనీ ఐపీఎస్ రాజేష్ మీనా అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జయ పాఠశాలలో ×జయ సృష్టి–2024₹ పేరిట సైన్స్ ఫేర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. ఉపాధ్యాయుల శిక్షణ, తల్లిదండ్రుల సహకారంతో పాటు నిరంతర శ్రమతో విద్యార్థులు జాతీయ స్థాయి పోటీ పరీక్షలలో విజయం సాధించవచ్చన్నారు. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేలా సైన్స్ ఫేర్ నిర్వహించిన జయ పాఠశాల యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. అనంతరం పలు ఎగ్జిబిట్లను సందర్శించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్, డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ, జిల్లా మానిటరింగ్ అధికారి డీఎస్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

విష్ణువర్ధన్‌శర్మకు అర్చక ఆధ్యాత్మిక సార్వభౌమ బిరుదు

మేళ్లచెరువు: మండల కేంద్రంలోని ఇష్టకామేశ్వరీ సమేత స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయ ప్రధానార్చకుడు కొంకపాక విష్ణువర్ధన్‌శర్మను సీవీ రామన్ అకాడమీ సేవా సాంస్కృతిక సంస్థ, రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం తరపున ఆదివారం హైదరాబాద్‌లోని హరిహర కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024 ఉగాది పురస్కారాలను పురస్కరించుకొని అర్చక ఆధ్యాత్మిక సార్వభౌమ బిరదుతో పాటు స్వర్ణ కంకణం, గోల్డ్ మెడల్ అందజేసినట్లు తెలిపారు.



విష్ణువర్ధన్‌శర్మను సత్కరిస్తున్న రుద్రాక్ష సేవా సంస్థ నిర్వాహకులు

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడు మృతి

తిరుమలగిరి (తుంగతుర్తి): తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. వివరాలు.. తొండ గ్రామానికి చెందిన ఈరెంటి యాదగిరి(50) గ్రామ పరిధిలో తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడిపోయాడు. స్థానికులు వచ్చి చూసేసరికి అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



యాదగిరి మృతదేహం


స్ప్రేయర్ల ఎంపిక.. పిచికారీ సులువిక

పాడి పంట

పెద్దవూర: ప్రస్తుతం మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా పంటలకు పురుగులు, తెగుళ్ల ఆశిస్తున్నాయి. దీంతో రైతులకు పంటలపై ఒకటికి రెండు సార్లు క్రిమిసంహారక మందులను పిచికారీ చేయడం పరిపాటిగా మారింది. పిచికారీ చేసేందుకు అవసరమైన స్ప్రేయర్లను సరిగా ఎంపిక చేసుకోకపోతే రసాయనాలు వృథా కావడంతో పాటు పిచికారీ చేసే వ్యక్తి శరీరంపై ప్రభావం పడుతుంది. ఈ నేపథ్యంలో వివిధ రకాల స్ప్రేయర్లకు సంబంధించిన విషయాలు పెద్దవూర మండల వ్యవసాయ అధికారి పి. సందీప్ వివరించారు.

తైవాన్ పవర్ స్ప్రేయర్..

ఇటీవల అన్ని రకరాల పంటలకు తైవాన్ పవర్ స్ప్రేయర్లతో మందులను పిచికారీ చేస్తున్నారు. దీని ఖరీదు కంపెనీలను బట్టి రూ.20వేల వరకు ఉంటుంది. తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో వెదజల్లే సామర్థ్యం దీనికి ఉంది. ఇతర వాటితో పోల్చితే దీనిలో సస్యరక్షణ మందులు మూడు వంతులు అధికంగా పోయాల్సి ఉంటుంది. రోజుకు సగటున 8 నుంచి 10 ఎకరాలలో పిచికారీ చేయవచ్చు. దీనికి అమర్చిన బెల్ట్ ద్వారా భుజాల వెనుక సులభంగా తగిలించుకోవచ్చును. ఈ పవర్ స్ప్రేయర్ చదరపు సెంటీమీటర్‌కు 30–35 కిలోల ఒత్తిడిని కలగజేస్తుంది. నీటి బిందువులు గుండ్రంగా తిరగడం వలన ఆకుల పైభాగాన, కింది భాగాన పడతాయి. ఇంజిన్ పనిచేయడానికి గంటకు లీటర్ పెట్రోల్ అవసరం అవుతుంది. లీటర్ పెట్రోల్ ఆరు ఎకరాలకు సరిపోతుంది. నిమిషానికి 7.2 లీటర్ల మందును చల్లవచ్చు. బరువు తొమ్మిది కిలోలు. దీనిలో 20 లీటర్ల రసాయం ద్రావణం, 900 మి.లీ. ల పెట్రోల్ పడుతుంది. ఇటీవల వచ్చిన ఆధునాతన పవర్ స్ప్రేయర్‌లతో ఒక వ్యక్తి మందు ద్రావణ డబ్బాను భుజానికి తగిలించుకుంటే , రెండు వైపులా ఇద్దరు వ్యక్తులు ఏకకాలంలో రసాయన మందును పిచికారీ చేసే పరిస్థితి వచ్చింది.



తైవాన్ స్ప్రేయర్



ఫుట్ స్ప్రేయర్

ఫుట్ స్ప్రేయర్..

ఇది కాళ్లతో పనిచేస్తుంది. మినుము, పెసర వంటి పంటలతో పాటు కూరగాయ తోటలు, మామిడి, బత్తాయి వంటి పండ్లతోటల్లో సస్యరక్షణ మందులను పిచికారీ చేయవచ్చు. రోజుకు రెండు ఎకరాల్లో, పండ్ల తోటల్లో సగటున రోజుకు 150 చెట్లకు పిచికారీ చేయవచ్చు. ధర నాలుగు వేల లోపే ఉంటుంది. ఇత్తడితో తయారైన ఫుట్‌స్ప్రేయర్‌లో ప్రధానంగా చిన్న బ్యారల్, కదిలే పిస్టన్ ఉంటుంది. బ్యారల్ అడుగుభాగానికి ప్లాస్టిక్ గొట్టం కలపబడి ఉంటుంది. రెండో చివరన ఫిల్టర్ గరాటు బిగించబడి ఒక పాత్రలోని రసాయన ద్రావణంలో మునిగి ఉంటుంది. పెడల్‌ను కాళ్లతో తొక్కినప్పుడు పిస్టన్ బ్యారల్‌లో పైకి కిందికి కదలడంతో ద్రావణం బ్యారల్ పైభాగానికి చేరి అక్కడి నుంచి గాలి గది ద్వారా రెండో గొట్టం చివర ఉన్న నాజిల్ గుండా బయటకు వెళుతుంది. గాలి గది అమరిక వల్ల ద్రావణంపై పీడనం ఎల్లప్పుడు సమానంగా ఉంచి పిచికారీ ఒకే విధంగా ఉండటానికి తోడ్పడుతుంది. దీనిలో చదరపు సెంటీమీటర్‌కు 8 నుంచి 13 కిలోల ఒత్తిడి తీసుకురావచ్చు. అధిక ఒత్తిడి వలన ఎత్తుగా ఉన్న మామిడి చెట్లకు సులభంగా పిచికారీ చేయవచ్చు.

నాప్‌సాక్ స్ప్రేయర్

దీని బరువు తక్కువగా ఉండేందుకు పాలిథీన్‌తో తయారు చేస్తారు, స్ప్రేయర్ ట్యాంకు పరిమాణం 15–16 లీటర్లు. దీనికి ఉన్న బెల్టుల ద్వారా భుజాల వెనక సులువుగా తగిలించుకోవచ్చు. పంట అన్ని దశల్లో మందు పిచికారీకి స్ప్రేయర్ సులువుగా ఉపయోగపడుతుంది. ధర రెండు వేల లోపే ఉంటుంది. ట్యాంకు లోపలి భాగాన పంపు, గాలి గది, పైభాగాన ఒక రంధ్రానికి ప్లాస్టిక్ గొట్టం బిగించబడి ఉంటుంది. రెండో చివర నాజిల్ ఉంటుంది. ట్యాంకులో అమర్చబడిన పిస్టన్ పైకి కిందకు కదలడం వలన ద్రావణంపై ఒత్తిడి ఏర్పడి రబ్బరు గొట్టం ద్వారా నాజిల్ ద్వారా బయటకు వెలువడుతుంది. పిస్టన్ కదిలించటానికి హ్యాండిల్ ఉంటుంది. దీనితో రసాయన ద్రావణం అంతటా సమంగా పడుతుంది.